


5 నుంచి ఆపరేషన్ స్వేచ్ఛ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 5 నుండి 11వ తేదీ వరకు జిల్లా ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కోర్టులోని న్యాయసేవ భవనంలో ఈనెల 5 నుండి 11వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహణ పై మీడియా సమావేశమ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ఇచ్చినటువంటి ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఈనెల 5 వ తేదీ నుండి 11 వ తేదీ వరకు ఆపరేషన్ స్వేచ్ఛ అనే కార్యక్రమం ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. గత జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో వెట్టిచాకిరీ చట్టంలో ఇరుకకుపోయిన బాల బాలికలు ఎవరు కూడా కనబడలేదని తెలిపారు. పోలీస్, స్త్రీ శిశుసంక్షేమ, కార్మికశాఖల అధికారులు సమన్వయం చేసుకొని ఈ ఆపరేషన్ మూష్కాన్ నిర్వహించవలసిన అవశ్యకత ఉందన్నారు.

పించన్ల పంపిణీ పై వదంతులను నమ్మవద్దు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో మొదటి రోజే 71శాతం పించన్ల పంపిణీ విజయవంతంగా జరిగింది. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఉదయం బ్యాంకుల్లో నగదు విత్ డ్రా చేయడం దగ్గర నుండి వార్డు సచివాలయాల్లో లబ్ధిదారులకు పింఛను సొమ్ములు పంపిణీ చేయడం వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. వార్డు సచివాలయాల్లో లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, కుర్చీలు, అవసరమైన ప్రాంతాల్లో షామియానాలు వేయించారు. కమిషనర్ బుధవారం ఉదయం ఐసిఐసిఐ బ్యాంకుకు వెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడారు. పింఛన్ సొమ్ములు వేగంగా అందించాలని


పెన్షన్‌ల పంపిణీని తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ

సూచించారు. అనంతరం సూపర్వైజర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సూపర్వైజర్ అధికారులు వారికి కేటాయించిన వార్డుల్లో ఉంటూ ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పింఛన్ అందేలా పర్యవేక్షించాలన్నారు. మధ్యాహ్నం కమిషనర్ పలు వార్డు సచివాలయాల్లో పర్యటించి పింఛను సొమ్ముల పంపిణీని పరిశీలించారు. దొడ్డిపల్లిలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ములను అందించారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారులందరికీ పింఛను అందజేయడం జరుగుతుందన్నారు. వార్డు కార్యదర్శులు సచివాలయాల్లో అందుబాటులో ఉంటారని లబ్ధిదారులు వారికి కేటాయించిన సమయంలో వచ్చి పింఛన్ సొమ్మును పొందవచ్చున్నారు. కాగా నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 16,698 పింఛన్లకు గాను మొదటిరోజు 11,782 (సాయంత్రం 7గంటలకు) పింఛన్లను పంపిణీ చేశారు. మిగిలిన పింఛన్లను గురువారం నాటికి పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సచివాలయాల ద్వారా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్టు సచివాలయ కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు: కలెక్టర్

చిత్తూరు అర్బన్: జిల్లాలో పెన్షన్‌ల పంపిణీపై వచ్చే వదంతులు, అపోహలను నమ్మి భయాందోళనలకు గురికావద్దని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ బి.పుల్లయ్యతో కలసి కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక పెన్షన్ల పంపిణీపై వచ్చే నిరాధారమైన వార్తలను, వదంతులను నమ్మి లబ్ధిదారులు భయాందోళనలకు గురికావద్దని కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి నెలా 2,74,553 మంది లబ్ధిదారులకు రూ.80.39 కోట్లు పెన్షన్ల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ఇందులో అధికంగా 1,46,496 మందికి వృద్ధాప్య పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతున్నదన్నారు. పెన్షన్ల పంపిణీకి గతంలో సచివాలయాల వారీగా వాలంటీర్ ద్వారా ఇంటింటికీ పెన్షన్‌లు పంపిణీ చేయడం జరిగేదని, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం వాలంటీర్లను పెన్షన్ పంపిణీకి వినియోగించరాదనే నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద గ్రామ,వార్డు సచివాలయ సిబ్బందితో పెన్షన్‌ల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. పెన్షన్‌దారులకు బ్యాంక్ అకౌంట్లు లేకపోవడం, బ్యాంక్ అకౌంటుకు ఆధార్ సీడ్ కాకపోవడం ద్వారా డిబిటి పద్ధతిలో పెన్షన్ చెల్లింపుకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున సచివాలయాల ద్వారా పంపిణీ చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సచివాలయాలకు రాగలిగిన వారికి 3వ తేదీ మధ్యాహ్నం నుండి పెన్షన్ల పంపిణీ చేస్తామని, రాలేని వారికి మూడు రోజుల తరువాత ఇంటి వద్దకే వెళ్ళి సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా అధిక భాగం సచివాలయ సిబ్బంది ఎన్నికల విధులలో నిగ్నమైన కారణంగా పెన్షన్‌ల పంపిణీ దాదాపుగా ఒక వారం నుండి 10 రోజుల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఎండలు అధికంగా ఉన్న సందర్భంగా పెన్షన్‌ల కోసం సచివాలయాలకు వచ్చే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సచివాలయాలలో సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పెన్షన్‌ల పంపిణీలో జాప్యం లేక ఇతర సమస్యల ఫిర్యాదు కొరకు 63004 33367 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాలలో నీటి ఎద్దడి ఉండే అవకాశం ఉందని, ప్రభుత్వం తరపున చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో డిఆర్‌డిఏ పిడి తులసి, డిఎల్‌డిఓ రవికుమార్ అధికారులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

'శాడిస్ట్ చంద్రబాబు'తో

యుద్ధానికి 'సిద్ధమా'..!

'మేమంతా సిద్ధం' సభలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పూతలపట్టు, సదుం

'చంద్రబాబు ఎంతగా దిగజారిపోయాడంటే ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చే లోపే సెలవు దినమైనా అవ్వతాతల మొహంలో చిరునవ్వులు చూస్తూ వాళ్ల చేతిలో పింఛన్ పెట్టే వాలంటీర్లపై చంద్రబాబు కుట్ర పన్నాడు.. చంద్రబాబు మనిషి నిమ్మగడ్డ ఇచ్చిన ఫిర్యాదు వల్లే వాలంటీర్ వ్యవస్థను రద్దు చేసిన పరిస్థితి కల్పించారు.. అవ్వతాతలు పింఛన్ అందుకునేందుకు నడవలేక పడుతున్న అగచాట్లు చూసినపుడు ఈ చంద్రబాబు మనిషా, శాడిస్టా' అనిపిస్తోంది అని సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఇలాంటి వ్యక్తికి మనం ఓటు వేయడం ధర్మమేనా? అని ప్రశ్నించారు. ప్రతి ఇంటికి వెళ్లి మళ్లీ జగనన్ననే తెచ్చుకుందామని స్టార్ క్యాంపెయిన్ చేయాలని పిలుపునిచ్చారు. 'మేమంతా సిద్ధం' ఏడో రోజు సభ బుధవారం సదుం, పూతలపట్టు మండలాల్లో కొనసాగింది. సదుం మండలం గొడ్లవారిపల్లి బస్టాప్ సమీపంలో పింఛన్‌దారులను ఉద్దేశించి ప్రసంగించారు. కల్లూరు శివారులో కురబల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. చంద్రగిరి నియోజకవర్గం దామలచెరువులో 20 క్రేన్లతో భారీ గజమాల ఏర్పాటు చేసి సిఎంకు స్వాగతం పలికారు.

సదుంలో పలువురు వైసిపిలో చేరిక

సిఎం బస చేసిన అమ్మగారిపల్లి వద్ద పెద్దఎత్తున టిడిపి నాయకులు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. కుప్పం ఎంఎల్‌సి భరత్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎం.సుబ్రమణ్యంరెడ్డి, కృష్ణమూర్తి, బేతప్పలు వైసిపి కండువా కప్పుకున్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆధ్వర్యంలో టిడిపికిచెందిన ఎ.హరిక్రిష్ణ సిఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం సిఎం యాత్ర ప్రారంభం కాగానే పలమనేరుకు చెందిన పట్టు రైతులు సిఎంను కలవడానికి ఇబ్బందులు పడ్డారు. సెక్యూరిటీ వారిని అడ్డుకోవడం కనిపించింది. కల్లూరు మీదుగా బస్సు యాత్ర కొనసాగింది. దారి పొడవునా డ్వాక్రా సంఘాల మహిళలు సిఎం జగన్‌కు స్వాగతం పలికారు.

పూతలపట్టు బైపాస్‌లో నిర్వహించిన బహిరంగసభలో సిఎం జగన్ మాట్లాడుతూ సభ మహాజన సముద్రాన్ని తలపిస్తోందన్నారు. ఇంటింటికి మేలు చేసిన సత్యనిష్టత మన ప్రభుత్వం ఓ వైపు ఉందని, మరోవైపు గతంలో మూడుసార్లు అధికారంలో ఉండి అబద్ధం, మోసం, చెడు, చీకటిని రిటర్న్ గిఫ్ట్‌గా ఇచ్చిన బృందం మన కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. ప్రజలకు మోసం చేయడమే అలవాటుగా పెట్టుకున్న చంద్రబాబుకు, ప్రజల పక్షాన ఉన్న జగన్‌కు మధ్య యుద్ధమన్నారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో మన ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి తోడుగా ఉండటం ద్వారా పేదలు, పిల్లలు, అక్కచెల్లెమ్మలు, అవ్వతాతలు, బడుగులు, బలహీనులు, మైనార్టీల తరపున నిలబడి, వీరిని రక్షించేందుకు మీరంతా సిద్ధమేనా అని అన్నారు. 175 అసెంబ్లీ సీట్లు, 25 ఎంపి సీట్లు గెలిపించుకుని పేదలకు తోడుగా ఉండి డబుల్ సెంచరీ సర్కార్ స్థాపించాలన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో మీకు మీ ఇంటికి ఏం చేశాడో ఆలోచించాలన్నారు. ఒక్క రూపాయి అయినా మీ అకౌంట్‌లో పడిందా గుర్తు చేసుకోవాలన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు చూస్తే మన ప్రభుత్వం గుర్తుకొస్తుందన్నారు. ప్రభుత్వ బడిని నాడునేడులా రూపురేఖలు మార్చేశామన్నారు. ఆరోగ్యశ్రీని రూ.25 లోల వరకూ ప్రతి పేదవానికి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రూ.2.70 లక్షల కోట్లు నేరుగా మీ బిడ్డ బటన్ నొక్కి, నేరుగా అక్క చెల్లెమ్మల చేతుల్లోకి వెళ్లిపోవడం అంటే మధ్యలో దళారీ వ్యవస్థ లేదన్నారు. 130 సార్లు బటన్ నొక్కి సంక్షేమ పథకాలను అందించామన్నారు. 2014లో ఇదే కూటమి చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మోడీ ఫొటోలతో ముఖ్యమైన హామీలంటూ ప్రతి ఇంటికి పంపించాడని, రైతుల రుణమాఫిపై సంతకం చేస్తానన్నాడని, పొదుపు సంఘాలకు రుణమాఫీ చేస్తామని చెప్పాడని, ఆడబిడ్డ పుట్టిన వెంటనే రూ.25వేలు బ్యాంకులో డిపాజిట్‌చేస్తానని చెప్పాడని, నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పాడని, సింగపూర్‌కు మించి చేస్తానన్నాడని, ఏ ఒక్కటైనా చేశాడా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అంటూ మరోసారి మోసం చేసేందుకు ఆ ముగ్గురూ మరోసారి ముందుకొస్తున్నారని, నమ్మవచ్చా? అని ప్రశ్నించారు.





కేసును రీ ఓపెన్ చేస్తానని సిఎం హామీ

రొంపిచెర్ల : తన బిడ్డ నారాయణ కళాశాల యాజమాన్యం న ఇర్లక్ష్యం వల్ల మృతిచెందాడని, తనకు న్యాయం చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు సిఎం జగన్మోహన్‌రెడ్డిని సదుం మండలం అమ్మవారిపల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లి గ్రామ పంచాయతీ ఫజుల్‌పేటకు చెందిన అబ్దుల్ నబీ, షాహీరాల రెండో కుమారుడు అబ్దుల్ నజీర్ (17) తిరుపతిలోని శ్రీనివాస మంగాపురం సమీపంలోని నారాయణ కాలేజీలో ఇంటర్ చదువుతూ 2021, ఫిబ్రవరి 21న వాలీబాల్ ఆడుతూ కళ్లు తిరిగి పడిపోయాడని, కళాశాల యాజమాన్యం ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వల్ల మృతిచెందాడని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కేసు రీ ఓపెన్ చేయిస్తానని సిఎం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీనివాస మంగాపురం నారాయణ కాలేజీకి ప్రభుత్వ అనుమతి లేదన్నారు. సిఎం జగన్ వెంట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారు.

బంగారుపాళ్యం: మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, థామస్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపి కండువా కప్పుకుని పార్టీలోకి చేరారు.

4న తొలి ర్యాండమైజేషన్

- ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఉత్తర్వులు జారీ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి విధుల కేటాయింపుకు సంబంధించి ఈనెల 4వ తేదీన తొలి ర్యాండమైజేషన్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు తొలి ర్యాండమైజేషన్‌లో పిఓ, ఏపీఓ, ఓపిఓలకు విధుల కేటాయింపులో భాగంగా సంబంధిత నియోజకవర్గం, మండలాలను కేటాయించడం జరుగుతుందన్నారు. పిఓలుగా ఉపాధ్యాయులు, ఈఈలు, డీఈలు నియామకం కాబడ్డారని, ఏపీఓలు, ఓపిఓలుగా ఇతర సిబ్బందిని నియామకం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందని, హోం ఓటింగ్ నిర్వహణపై కసరత్తు జరుగుతున్నదని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు వాలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలను ప్రోత్సహిస్తున్నారని, ఈఅంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నగరి నియోజకవర్గం విజయపురం మండలం పాత ఆర్కాట్‌కు చెందిన రాజేశ్వరి, సురేష్, మహారాజపురం ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్న దేవరాజులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని వీరిపై చర్యలు తీసుకోవాలని, సామాజిక పింఛన్ల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకొని రాగా ... ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెసి పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, కాంగ్రెస్ ప్రతినిధి పి. భాస్కర్, పరదేశి, టిడిపి ప్రతినిధులు సురేంద్ర కుమార్, కొండయ్యలు, వైసిపి ప్రతినిధి సూర్యప్రతాప్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

మే11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

గౌరవ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనలు మేరకు మే 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవనంలో మే 11న జిల్లాలో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 11న జిల్లా కేంద్రంతో పాటుగా 13 మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వివిధ కోర్టులలో వివిధ రకాల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కోర్టులో వేయని వివాదా కేసులు ఉంటే అవి కూడా ముందస్తు పిటిషన్స్ ఫిర్యాదుగా స్వీకరించి సమన్యాయం అందించుటకు ఈ లోక్ అదాలత్ మంచి పాత్రను పోషిస్తుందన్నారు. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి భీమారావ్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కేసులను రాజీ చేయుటకు గుర్తించడం జరిగిందని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణ కుమార్

'8న యుటిఆర్‌సి కమిటీ ఏర్పాటు'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జైళ్లలో మగ్గుతున్న ఖైదీల బాగోగులను చూడవలసిన అవశ్యత ఉందని జిల్లా న్యాయ సేవా అధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కోర్టులోని న్యాయసేవ భవనంలో జిల్లాలో మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే నల్ అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశాలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయసేవ అధికార సంస్థ ఉత్తర్వుల మేరకు, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ఇచ్చిన సూచనల మేరకు జిల్లాలో ఏప్రిల్, జులై, అక్టోబర్ మాసాలలో మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నేరఆరోపణ కాబడిన ఖాదీలందరికీ రాజ్యాంగం కల్పించిన చట్టాల ప్రకారంగా జైల్ నుంచి బయటకు తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈకమిటీలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చైర్మన్‌గా, డిఎల్‌ఎస్‌ఏ, మూడు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జైల్ పర్యవేక్షకులు, మెంబర్లగా ఉండి ఖైదీల కేసులను వేగవంతంగా పరిశీలించి చట్ట ప్రకారం బయటకు తీసుకురావడానికి అవకాశాలున్నాయన్నారు. ఈనెల 8 సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ కన్నా యుటిఆర్‌సి కమిటీని ప్రారంభించడం జరుగుతుందన్నారు.

తల్లిపాల దాతలకు వందనం

తల్లిపాల నిల్వ నిధి ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి

తిరుపతి ప్రసూతి వైద్యశాల రెండో అంతస్తులో రోటరీక్లబ్ సౌజన్యంతో తల్లిపాల నిల్వ నిధిని బుధవారం ప్రారంభించారు. ఎస్‌వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ తల్లిపాల నిధి పాలు లేని బిడ్డలకు బతుకునిస్తుందన్నారు. ఓ మహిళ తన బిడ్డకు ఇవ్వగా మిగిలిన పాలను స్వచ్ఛందంగా దానం చేయడానికి ముందుకు వచ్చే ఆరోగ్యకరమైన తల్లుల దగ్గర నుంచి పాలను సేకరించి, సమగ్రంగా పరీక్షలు నిర్వహించి, భద్రపరచి అవసరమైన చిన్నారులకు అందిస్తారన్నారు. దీన్నే తల్లిపాల నిధి అంటారని తెలిపారు.

డాక్టర్ పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ తల్లిపాలకు కులమత వర్ణ వర్గ, పేద ధనిక బేధాలు లేవన్నారు. ఆరోగ్యకరమైన ఏ తల్లి ఇచ్చిన పాలనైనా, ఏ బిడ్డకైనా పట్టవచ్చునే నినాదంతో రాయలసీమలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ ఆస్పత్రిలో తిరుపతి రోటరీక్లబ్ సహాయార్థంతో ప్రారంభించామన్నారు. చిన్నపిల్లల తల్లులు ఈ గొప్ప అవకాశాన్ని ఉచితంగా అందిపుచ్చుకోవాలన్నారు. డాక్టర్ జి.రవిప్రభు మాట్లాడుతూ దాతల నుంచి పాలను రెండు విధాలా సేకరిస్తారన్నారు. దాత ఇంటి నుంచి మిల్క్ బ్యాంక్ యూనిట్ స్థాపించిన వైద్యశాల నుంచి అని తెలిపారు. ప్రసూతి వైద్యశాలలో రెండో అంతస్తు రూమ్ నంబర్ 5, 6 లలో ఈ భాగాన్ని ఏర్పాటు చేశారన్నారు. బ్రెస్ట్ పంపు ద్వారా 30 నుంచి 40 మిల్లీ లీటర్ల వరకు దాతలు పాలు ఇవ్వవచ్చు. దాతలు తమ సమ్మతిని తెలియజేసే దరఖాస్తును ఆధార్‌కార్డు ఆధారిత చిరునామా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ సంతోష్‌కుమార్ (సుశానా హెల్త్ ఫౌండేషన్) మాట్లాడుతూ ఓ తల్లి పాలు ఇంకో బిడ్డకు ప్రాణం పోస్తుంటే ఆ సంతోషం వెలకట్టలేనిదన్నారు. మిగులుపాలు ఉన్న తల్లులు ఆలోచించాల్సిన విషయమన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ తిరుపతి రోటరీక్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాలను దానం చేయడం వల్ల దాతలకు ఎన్నో లాభాలున్నాయని వివరించారు. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ రాదని వివరించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిడియాటిషన్ తిరుపతి సరితా చౌదరి కలకత్తా, డాక్టర్ శ్రీనాథ్ మణికంఠ సీనియర్ కన్సల్టెంట్ నియో నేటాలజీ బెంగళూరు, ప్రసూతి వైద్య విభాగాధిపతి డాక్టర్ ప్రమీల, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఏఎస్ కిరీటి, తిరుపతి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఫణి రాజ్ కుమార్, సెక్రటరీ రోటరీ క్లబ్ రవికుమార్, చైర్మన్ దామోదరం పాల్గొన్నారు .


మెటర్నిటీ ఆస్పత్రి రెండో అంతస్తులో తల్లిపాల నిల్వ నిధి ప్రారంభం

రూపశ్రీ కేసులో

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విశాఖ శ్రీచైతన్య కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న రూప శ్రీ మరణానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు వచ్చిన తర్వాత సామాన్య మధ్యతరగతి వారికి చదువు దూరమవడమే కాకుండా ఖరీదైన విద్యగా మారిపోయిందని అన్నారు. లక్షల రూపాయలు ఫీజులు కట్టి తల్లిదండ్రులు చదివిస్తున్నప్పటికీ అక్కడ జరుగుతున్న వేధింపులకు తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే చనిపోతున్న సంఘటనలు రోజు జరుగుతున్నాయి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రత్యేకంగా ఉంచి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'ఎన్నికల నిబంధనలకు లోబడే కార్యక్రమాల నిర్వహణ'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జాతీయ నాయకుల జయంతి కార్యక్రమాలను ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని సమావేశపు మందిరంలో ఈనెల 5 నిర్వహించనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, అక్టోబర్ 14న నిర్వహించాల్సిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలకు సంబంధించి దళిత సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మోడల్ కోడ్ అమలులో ఉందని కోడ్ నిబంధనలకు లోబడి జయంతి కార్యక్రమాలు నిర్వహించబడతాయని అన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగే జాతీయ నేతల జయంతికి సంబంధించి గతంలో లాగానే నిర్వహించాలని దళిత సంఘాల నేతలు కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇటువంటి రాజకీయ ప్రసంగాలకు అవకాశం లేకుండా నిర్వహించాలని అన్నారు. 5 తేదీన బాబు జగ్జీవన్ రామ్ జయంతిని చిత్తూరు గంగినేని చెరువు వద్ద గల విగ్రహం వద్ద నిర్వహించి కొంత దూరం ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ఈనెల 14న చిత్తూరులోని దర్గా సర్కిల్‌లో గల విగ్రహం వద్ద అధికారుల ప్రసంగాల అనంతరం ర్యాలీ జరుగుతుందని వివరించారు. ఎట్టి పరిస్థితులలోనూ మోడల్‌కోడ్ పరిధిని దాటి ఈకార్యక్రమాలు నిర్వహించకూడదని అన్నారు. డిఆర్‌ఓ పుల్లయ్య, జెడి సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం'

ప్రజాశక్తి-వెదురుకుప్పం: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అన్నారు. బుధవారం కళాశాలలో సైబర్ జాగృకత దివాస్ సందర్భంగా వెబినార్ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు వీక్షించారు. కార్యక్రమంలో సైబర్ నేరాలకు సంబంధించి పలు సూచనలు, సలహాలు తెలుసుకున్నారు.

టీడీపీలో చేరిక


టీడీపీలో చేరుతున్న నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని విజలాపురం దళితవాడకు చెందిన వైసీపీ కార్యకర్తలు టిడిపిలో చేరారు. బుధవారం 17కుటుంబాల కార్యకర్తలకు టీడీపీ నాయకులు డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు కుమార్, వేణుగోపాల్ రెడ్డి, ప్రసాద్, మునప్ప, వేణుగోపాల్ గౌడు, గుర్రప్ప నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల పంచాయతీలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆర్‌డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ పోలింగ్ సంబంధించిన ఏర్పాట్లు, సదుపాయాలను తహశీల్దార్ స్వర్ణలతను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చి ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకొనేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి: శివశంకర్


శివశంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-వికోట, పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శివశంకర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా శివశంకర్‌ను ప్రకటించిన నేపథ్యంలో బుధవారం నియోజకవర్గస్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికార వైసీపీ, ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో ఉన్న నేతలు తల్లి కాంగ్రెస్ నుండి వెళ్లిన వారే ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. వైయస్ షర్మిల నేతృత్వంలో రాబోయే ఎన్నికల్లో మరల కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తిరిగి మాతృ పార్టీలోకి రావాలని నేతలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాల నుండి విచ్చేసిన నేతలు, కార్యకర్తలు శివశంకర్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

ముస్లిం మహిళలకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-రామకుప్పం: ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ముస్లిం మహిళలు తొలిసారి బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక కళ్యాణ మండపంలో మైనార్టీ మహిళలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనందదాయకంగా ఉందని ఆమె అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలు అందించేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని, అందరి ఆర్థిక అభివృద్ధితోనే ప్రజా పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బర్కతుల్లా, తన్వీర్, శోకత్‌అలీ, తజ్జు, అత్తర్, అన్సర్, నయాజ్ అహ్మద్, ఎజాస్, జబీవుల్ల పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పీఎం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతీ పూజను వైభవంగా జరిపారు. విద్యార్థులు ఓం ఆకారాన్ని తీర్చిదిద్ది అందులో ఆకట్టుకొనేలా క్యాండిల్స్ ఏర్పాటు చేశారు. పలువురు అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థులను ఆశీర్వదించారు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-సదుం: మండలంలోని తాటిగుంటపాలెం పంచాయతీలోని పాపిరెడ్డిగారిపల్లెలో దేరంగుల కృష్ణయ్య కుమారులు వాసు, మధు, దామోదర్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి పూటా భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో డిఆర్ కృష్ణయ్య కుటుంబీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలలో
21వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-శాంతిపురం: మండల కేంద్రంలోని శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 21వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆశా శంకరప్ప విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ గత 20సంవత్సరాలుగా అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో ఉత్తమ విద్యార్థులను వివేకానంద పాఠశాలలో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సహాయ సహకారాలతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేవలం విద్యా పరమావధిగా కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ మేళాలు తదితర అంశాలపై విద్యార్థులను చైతన్య పరుస్తున్నట్లు ఆమె తెలిపారు. గత 15సంవత్సరాలుగా కుప్పంలోనూ తమ విద్యా సంస్థ అత్యుత్తమ విద్యా ప్రమాణాలను నమోదు చేస్తోందని ఆమె పేర్కొన్నారు. రానున్న కాలంలో శాంతిపురంలోనూ పక్కా భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ 21వ వార్షికోత్సవ కార్యక్రమంలో కుప్పం, శాంతిపురం శాఖల కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులు, రెండు పాఠశాల సిబ్బంది హాజరయ్యారు.

మహిళా వర్సిటీలో స్టేట్ లెవెల్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, యోగి వేమన విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన స్టేట్ లెవెల్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ లో 'ట్రాన్స్ఫార్మింగ్ కన్వెన్షనల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ ఇన్ టు మార్కెట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్' అంశంపై బుధవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య భారతి మాట్లాడుతూ నూతన విద్యా విధానం 2020 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలను అనుసరించి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తి చేసిన వెంటనే విద్యార్థులు ఉపాధి అందుకునేలా నైపుణ్య ఆధారిత కరిక్యులం రూపొందించాలని తెలిపారు. గౌరవ అతిథి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాల నుండి మొత్తం 15 సబ్జెక్టులలో నిష్ణాతులైన ప్రొఫెసర్లు పాల్గొని కర్యులం ఫ్రేమ్ వర్క్ రూపొందించాలని తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం డీన్ అకాడమిక్ ఎఫైర్స్ ఆచార్య జి దాము మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో జీవన నైపుణ్యాలు ప్రముఖ పాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమం కన్వీనర్ టిజి అముద వల్లి మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయిన వెంటనే తక్షణ ఉపాధి మార్గాలను అందు కునేలా నూతన సిలబస్ రూపొందించాలని సూచించారు. విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కొత్త సిలబస్ స్కిల్ ఓరియంటెడ్ గా టెక్నాలజీ ఓరియెంటెడ్ గా రీసెర్చ్ ఓరియెంటెడ్ గా ముఖ్యంగా స్టూడెంట్ ఓరియంటెడ్ గా స్టూడెంట్ బెనిఫిటెడ్ గా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఆచార్య మమత, ఆచార్య అరుణ, వివిధ విభాగాల ఆచార్యులు, ఆంధ్రప్రదేశ్ లోని వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- కెవిబిపురం: కెవిబిపురం మండలంలోని తిమ్మసముద్రంలో తాగునీటి చలి వేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెక్రెటరీ అమ్ములు మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ వేడిమిని తట్టుకోవాలంటే తాగునీటిని ఎక్కువ తాగాలని తెలిపారు. తాగునీటి కోసం ఎవరూ ఇబ్బంది పడకుండా ఉండాలంటే చలి వేంద్రాలు అవసరమని ఇందుకోసం అధికారుల ఆదేశాల మేరకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపి ఎస్‌టి సెల్ ప్రెసిడెంట్‌కు మాతృ వియోగం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట పంచాయతీ రామసముద్రానికి చెందిన టిడిపి మండల ఎస్టీ సెల్ ప్రసిడెంట్ పూల ప్రవీణ్ తల్లి పూల పద్మమ్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఆమె మృత దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతికి సంబంధించిన వివరాలను వారి బంధువులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు.

ఆర్‌టీసీ డిపోలో బస్సుల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో గ్యారేజీలో బస్సులను డిపో మేనేజర్ ప్రశాంతి బుధవారం తనిఖీ చేసి సిబ్బందితో బస్టాండ్‌లో కండక్టర్లతోనూ సమావేశం నిర్వహించారు. 'అధికారులకు కనిపించదా?' అనే శీర్షిక ఓ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు మేనేజర్ ప్రశాంతి స్పందించారు. పుత్తూరు ఆర్‌టిసి డిపో భద్రతా దళ విభాగం సిబ్బంది విచారణలో పుత్తూరు డిపో కు సంబంధించిన ఏపీ 39జెడ్ 0166 బస్సు గ్యారేజ్ లోకి ఇన్ కమింగ్ అయినపుడు సర్వీస్‌కు వెళ్లినప్పుడు డిపోలో జరిగిన విచారణలో ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధించిన స్టిక్కర్లు, పోస్టర్లు, బ్యానర్లు కానీ బస్సులో లేవని తేలిందన్నారు.

రేపు తిరుమలలో
'డయల్ యువర్ ఈవో'

ప్రజాశక్తి- తిరుమల:

'డయల్ యువర్ ఈవో'ను ఈ నెల 5వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుపతి టీటీడీ పరిపాలన భవంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా తెలుపవచ్చు. భక్తులు ఫోను నెంబరు 0877-2263261 ద్వారా సందేహాలు, సూచనలు అందించ వచ్చుని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి


యువనేస్తం అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి -ఏర్పేడు : మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్, కార్యదర్శి జశ్వంత్ పేర్కొన్నారు. యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలంలోని రాజుల పాలెం ఎస్టీ కాలనీ, చిందేపల్లి ఎస్టీ కాలనీ, కృష్ణగిరి ఎస్టీ కాలనీ, రాజుల పాలెం ఎస్టీ కాలనీ, అముడూరు ఎస్టీ కాలనీల మహిళలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్, కార్యదర్శి జశ్వంత్ మాట్లాడుతూ గిరిజన మహిళలు అన్నీ రంగాల్లోనూ ముందుకెళ్లాలన్నారు. గ్రామాలకు దూరంగా ఎస్టీ కాలనీలు ఉన్నాయని తెలిపారు. గిరిజనులందరూ ఐకమత్యంగా ఉండి వారి సమస్య లను వారే పరిష్కరించుకోవాలని, తమ హక్కులను సాధించేందుకు గిరిజనులలో రాజకీయ చైతన్యం రావాలని, గిరిజనుల అభివృద్ధికి యువ నేస్తం అసోసియేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. అసోసియేషన్ మండల కోఆర్డినేటర్లు అరుణ, నాగమణి, వాలంటీర్లు వెంకటేష్, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: ఎంఈవో


మాట్లాడుతున్న ఎంఈవో అంబటి బాలయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యమని శ్రీకాళహస్తి మండల విద్యాశాఖ అధికారి అంబటి బాలయ్య అన్నారు. పట్టణంలోని సన్నిధి వీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థు లకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్యా బోధన కోసం ప్రతి తరగతి గదిలోనూ ఐఎఫ్‌పి ప్యానల్స్, ఎనిమిదో తరగతి నుంచి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ విద్యా నైపుణ్యాలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్చడం ద్వారా వారికి ఉత్తమ బోధన లభ్యమవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి, సిఆర్‌ఎంటి ముని మోహన్, ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన, ఉపాధ్యాయులు హేమకుమార్, అరుణ, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాసా పోటీలలో నారాయణ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అమెరికాలోని నాసా వారు నిర్వహించిన అంతర్జాతీయ పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో పాల్గొని తిరుపతి నారాయణ పాఠశాల విద్యార్థులు రూపొందించిన మిషన్ స్పైడర్‌కు హానరబుల్ మెన్షన్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా స్థానిక న్యూ బాలాజీ కాలనీ ఏబిపీ క్యాంపస్ లో ఆ పాఠశాల ఏజిఎం కిషోర్, ఆర్ఐ వసంత్ మాట్లాడుతూ మన దేశ భవిష్యత్తుకు పునాదులుగా ఉన్న యువతలో స్పేస్ టెక్నాలజీ పై అవగాహన కల్పించడం, మానవాళికి ఉపయోగపడే సాంకేతిక అవసరాలను ప్రజలకు తెలపడం తద్వారా శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడంలో విద్యార్థి దశమించే వారిలో సృజనాత్మకతను వెలికి తీయడమే నారాయణ సంస్థల లక్ష్యం అని తెలిపారు. విద్యార్థులకు అభినందనలు తెలిపి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షాహిద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద 11 ప్రాజెక్టులు సెలెక్ట్‌కాగా అందులో రెండు ప్రాజెక్టులు తిరుపతి జిల్లా వే కాగా, ఆ రెండు ప్రాజెక్ట్‌లు నారాయణ ఏబిపి క్యాంపస్, నగరి నారాయణ బ్రాంచి రెండు నారాయణ పాఠశాలకు చెందినవి కావడం విశేషమని తెలిపారు.

విద్యార్థికి నగదు బహుమతి అందజేత

ప్రజాశక్తి -ఏర్పేడు: నవోదయ పాఠశాల ప్రవేశానికి ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మౌనికను ఎంఈవో 2 బుధవారం అభినందించి బహుమతి అందించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాకరకాయలకుంటలో 5వ తరగతి చదువుతున్న మౌనిక నవోదయ పాఠశాలకు ఎంపికైంది. మండల విద్యాశాఖ అధికారి 2 ఏ దయాకర్ మౌనికకు పుష్పగుచ్ఛం ఇచ్చి నగదు బహుమతులు ఇచ్చి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన నవోదయ పాఠశాల ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మౌనిక ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆ విద్యార్థిని ఆదర్శంగా తీసుకుని మండలంలోని మిగిలిన విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో నవోదయ, సైనిక్ తదితర నాణ్యమైన పాఠశాలల ఎంపిక పరీక్షలు రాసి ఉత్తీర్ణులై ఆ పాఠశాలలో చదివి తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కల్పన, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్‌పై సదస్సు



మాట్లాడుతున్న శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం, ఐక్యూఏసి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్' అంశంపై ఒకరోజు సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సదస్సును అనుదీప్ ఫౌండేషన్ సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ మాట్లాడుతూ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్ది సైబర్ నేరగాళ్ల అధికమవడంతో సైబర్ క్రైమ్ నుంచి సమాచారాన్ని కాపాడటంలో సైబర్ సెక్యూరిటీ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సెమినార్ రిసోర్స్ పర్సన్ గా మంగేష్ సూర్యకాంత్ , డైరెక్టర్, అనుదీప్ ఫౌండేషన్ సైబర్ సెక్యూరిటీ ప్రాథమిక అంశాలు, ఎథికల్ హ్యాకింగ్ ప్రాముఖ్యత, సైబర్ సెక్యూరిటీలో కెరీర్ మార్గాల గురించి వివరించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, సదస్సు అధ్యక్షులు డాక్టర్ కె ఉమారాణి మాట్లాడుతూ నైతిక, బాధ్యతాయుతమైన ప్రవర్తనల ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.భువనేశ్వరి దేవి, ఐక్యూఏసి కోఆర్డినేటర్, డాక్టర్ జయశ్రీ, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ జి. బాలకృష్ణప్రియ, పి.ఆర్ భారతి, డాక్టర్ కె. శ్రీలక్ష్మి, అనుదీప్ ఫౌండేషన్ సిబ్బంది, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతకు సన్మానం

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని కొలమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాత స్వచ్ఛంద సంస్థ సీఈవో దశరథరామిరెడ్డిని పలువురు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన రూ.2.20లక్షల సాయం అందజేశారు. పాఠశాలలో చేపట్టిన విద్యుదీకరణ, ఫ్యాన్లు ఏర్పాటు, సంపు నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంక్, మోటార్ ఏర్పాటు, హ్యాండ్ వాష్, స్టేజి నిర్మాణం తదితరాలను సమకూర్చుకూర్చారు. వాటిని దశరథ రెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు.

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. బుధవారం నగరపాలక పరిధిలోని 27, 28 డివిజన్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. అదేవిధంగా 32వ డివిజన్‌లో టీడీపీ నాయకులు హేమావతి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రబాబు, బాషా, రిక్షా బాషా, హర్షవర్ధన్, మంజుల, నలిని, పుష్ప పాల్గొన్నారు.

పోలింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మాస్టర్ ట్రైనర్లు పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ అన్నారు. గంగాధర నెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం మాస్టర్ ట్రైనర్ అధికారులకు పోలింగ్ రోజు ప్రక్రియ ప్రారంభం, అసలైన ఓటర్లు బోగస్ ఓటర్లు గుర్తించడం, అందులు, విభిన్న ప్రతిభావంతులు, నిస్సహాయులు, టెండర్ బ్యాలెట్ చాలెంట్ ఓటు, పోలింగ్ ఏజెంట్ల ప్రక్రియ, పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీయం యంత్రాలకు సీలు వేసే వరకు పిఓలు, ఏపీవోలుకు ఇవ్వాల్సిన శిక్షణ గురించి ఏఎస్‌వో ఆనందమోహన్ అవగాహన కలిగి ఉంచడంతోపాటు ట్రైనరు అడిగే ప్రశ్నలకు సమాధానాలు వివరాలతో తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, ఎన్నికల డిటి విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

ఆగివున్న బస్సులను ఢీకొన్న టెంపో

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ఆగివున్న బస్సులను టెంపో ఢీకొన్న సంఘటన మంగళవారం రాత్రి బైరెడ్డిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పూతలపట్టు నియోజకవర్గంలో నిర్వహించే సీఎం సభకు శాంతిపురం మండలంలోని మల్లెపాడు గ్రామం నుంచి ప్రజలను తరలించేందుకు పలమనేరు డిపో ఆర్టీసీ బస్సులు మంగళవారం రాత్రి బయలుదేరాయి. మార్గమధ్యలో పలమనేరు-కుప్పం జాతీయ రహదారిలోని బైరెడ్డిపల్లి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద బస్సులు ఆపి డ్రైవర్లు సేదతీరుతున్నారు. పలమనేరు నుంచి కుప్పం వైపు వెళుతున్న టెంపో అదుపుతప్పి వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో రెండు బస్సులు ఒకదానికి ఒకటి ఢీకొని దెబ్బతిన్నాయి. ప్రమాదంలో టెంపో డ్రైవర్ గాయాలతో ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. కాగా దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశీర్వదించండి: చల్లా

ప్రజాశక్తి-సోమల: ప్రజలంతా ఒక్క అవకాశం ఇచ్చి టీడీపీ పుంగనూరు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి(బాబు) ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం ఆయన సోమల పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అభిమానులు ఘనస్వాగతం పలికారు. టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట సుధీర్ రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన పట్టణం లోని1,2,3వ వార్డుల్లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మ్యానిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రవి, దసరాధచారి పాల్గొన్నారు.

78 మంది ఫార్మసీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఒమేగా హెల్త్ కేర్ ప్రతినిధులు విజయ శేఖర్ తరుణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలో సెవెన్ హిల్స్ ఫార్మసీ విద్యార్థులు 78 మంది చెన్నై కు చెందిన ఒమేగా హెల్త్ కేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికకు వివిధ కళాశాలల నుండి బి ఫార్మసీ, ఫార్మా డీ, ఎం ఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న చివరి సంవత్సరానికి చెందిన 110 మంది విద్యార్థులు హాజరయ్యారు. నియామకపు ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు రాత, సాంకేతిక, వ్యక్తిత్వ, మౌఖిక పరీక్షలు నిర్వహించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఒమేగా హెల్త్ కేర్ ప్రతినిధి విజయ్ శేఖర్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.2లక్షల35వేలు వేతనంగా నిర్ణయిస్తూ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రాంగణ నియామకాలలో ఎంపికైన సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు కరస్పాండెంట్ ఎం సుమలత, కళాశాల బోధన, బోధనేత సిబ్బంది అభినందనలు తెలిపారు.

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్, ట్రోఫీ బహూకరణ


సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందుకున్న కరాటే విద్యార్థులు

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట పట్టణంలోని పాత చెక్ పోస్ట్ లోని ఇన్ ఫ్యాంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రాండ్ మాస్టర్ దేవరాజులు ఆధ్వర్యంలో బుధవారం బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. కరాటే విద్యార్థులకు కటాస్, కర్ర సాము, ఫైటింగ్ విభాగాలలో బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు నెక్స్ట్ లెవెల్ కు ప్రమోట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్ ఫ్యాంట్ జీసస్ పాఠశాల ప్రిన్సిపాల్ గురుశ్రీ సైమన్ చేతుల మీదుగా సర్టిఫికెట్, ట్రోఫిలను అందించారు. ఈ సందర్భంగా గురుశ్రీ సైమన్ మాట్లాడుతూ ముందు కరాటే విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. మీరు చూపిన నైపుణ్యత ఎంతో ఆకట్టుకుందన్నారు. గతంలో కన్నా మెరుగ్గా చేయడం అభినందనీయమన్నారు. ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాలికలకు కరాటే విద్య నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. గ్రాండ్ మాస్టర్ దేవరాజులు మాట్లాడుతూ రానున్న సమ్మర్ హాలిడేస్ లో కరాటే ఉచితంగా నేర్పిస్తామని తెలిపారు. ఇన్ ఫ్యాంట్ జీసస్ పాఠశాల మైదానంలో ఉదయం సాయంత్రం ఉచితంగా క్లాసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సాహవంతమైన పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించి శిక్షణకు పంపాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా రేణిగుంటలో కరాటే శిక్షణ ఇస్తున్నానని తనకు ఫీజులు ముఖ్యం కాదని విద్యార్థులను ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకెళ్లటం ముఖ్యమన్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఉంటే ఒక విద్యార్థికి ఫీజు కడితే కరాటే నేర్పిస్తానని పేర్కొన్నారు. తన గురువు గ్రాండ్ మాస్టర్ సుందర మూర్తి నేర్పించిన విద్యను 10 మందికి నేర్పించాలన్న ఆశయం తోనే ముందుకెళుతున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అల్ఫ్రెడ్ ప్రేమ్‌చంద్, ఉపాధ్యాయులు కరాటే మాస్టర్లు ఆనంద్, ముకుందా, హేమంత్, కరాటే ఆర్గనైజర్ సౌందర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.